క్లుప్తంగా

కండలేరులో 56.090 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 56.090 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 10,100 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 590, పిన్నేరుకాలువకు 90, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

సింగనాలత్తూరులో వైద్య పరీక్షలు



గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న వైద్యులు

దొరవారిసత్రం : మండలంలోని సింగనాలత్తూరు గ్రామంలో శనివారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించి రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ అధికారులు గర్భిణుల పౌష్టికాహారం అందజేశారు. బిడ్డ తల్లులు, కిశోర బాలికలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా శాఖ అధికారులు తెలియజేశారు. డీవీ సత్రం పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య బీపీ, షుగర్, క్యాన్సర్, మానసిక వైద్య పరీక్షలు వంటివాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మణి, ఐసీడీఎస్ అధికారులు జ్యోతికిరణ్, అంకమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ



ర్యాలీ చేస్తున్న క్రైస్తవ యువత, చిన్నారులు

గూడూరురూరల్ : పట్టణంలోని చర్చివీధిలో ఉన్న సార్వత్రిక క్రైస్తవ ప్రార్థనా మందిరంలో ఈ నెల 24వ తేదీ నుంచి 27 వరకు చిన్న పిల్లలకు విరామ బైబిల్ పాఠశాల(విబిఎస్)ను నిర్వహించారు. నాలుగు రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమంలో బైబిల్ కథలు, సందేశాలు, దేవుని పాటలకు నృత్యాలు, రాతపూర్వకమైన పరీక్షలు నిర్వహించారు. చివరి రోజైన శనివారం పట్టణ పురవీధుల్లో యువతతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చి వద్దకు చేరుకుని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దైవజనులు పూలా డానియేల్ రవికుమార్, ప్రార్థన మందిరం బ్రదర్స్, సిస్టర్స్, పట్టణ, రూరల్ ప్రాంతాల్లో చిన్నారులు పాల్గొన్నారు.

అందుబాటులో లేని అధికారులు

పెళ్లకూరు: మండలంలోని దిగువచావలి గ్రామ సచివాలయంలో అధికారులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో సచివాలయ పరిధిలోని ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సచివాలయ సేవలు అద్దె భవనం నుంచి కొనసాగుతున్నాయి. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించకుండా మొక్కుబడిగా వచ్చి వెళుతున్నారు. ఈ క్రమంలో ధ్రువపత్రాల కోసం సచివాలయానికి వచ్చే ప్రజలకు అగచాట్లు తప్పడం లేదు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది కార్యాలయానికి రాకుండా మండల కేంద్రాలకు, సొంత పనులకు పరిమితమైనట్లు తెలుస్తుంది. ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శి, దూర ప్రాంతాల నుంచి వచ్చే మరి కొందరు సిబ్బంది చుట్టపుచూపుగా వచ్చి వెళుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని సచివాలయ సిబ్బంది పనితీరు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సజ్జలతో నేదురుమల్లి



వెంకటగిరి (సైదాపురం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కో- ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సదుం మండలం ఎర్రతివారిపల్లిలో నిర్వహించిన పుంగనూరు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. తొలుత సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పలు రాజకీయ అంశాలపై చర్చించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కలిమిలి రాంప్రసాద్‌రెడ్డితోపాటు పట్టణ, మండలాలకు చెందిన ముఖ్య నేతలు సమావేశంకు హాజరయ్యారు.

చికెన్ ధరలు 28-09-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	118
లేయర్ లైవ్	:	110
బ్రాయిలర్ చికెన్	:	214
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	236
లేయర్ చికెన్	:	187

అక్షరాలే తారాజువ్వలై..

పెళ్లకూరు మండలంలోని జాతీయ రహదారి నుంచి సుమారు ఒక కిలోమీటరు దూరంలో మారుమూల కుగ్రామం జీలపాటూరు ఉంది. రోడ్డుకు ఇరువైపులా పచ్చని పొలాలు, చెమటోడ్చి పని చేసే కర్షకులు, చెరువుకట్టపై మేత మేసే గేదెలు, గొర్రెలు, మేకలు కనిపిస్తుంటాయి. గ్రామంలో అడుగుపెడితే ఎత్తయిన భవంతులు, వీధివీధికి సిమెంట్ రోడ్లు, ఆప్యాయంగా పలకరించే పల్లె జనులు తారస పడతారు. ఈ కుగ్రామం చదువుల తల్లికి నిలయంగా, సరస్వతి బిడ్డలు పుట్టిన ఊరుగా మారింది.



జీలపాటూరు గ్రామం

- సరస్వతి బిడ్డల ఊరు జీలపాటూరు
- 360 కుటుంబాలు
- 30 మంది డాక్టర్లు, 28 మంది ఇంజనీర్లు, ఇద్దరు లాయర్లు

పెళ్లకూరు : మండలంలోని జీలపాటూరు గ్రామంలో 368 కుటుంబాలు, 1432 మంది జనాభా ఉంది. ప్రతి కుటుంబం వ్యవసాయ ఆధారితంగానే జీవనం సాగిస్తున్నారు. ఒకప్పుడు వరి, వేరుశనగ, చెరకు, సజ్జ, రాగి పండించే ఇక్కడి రైతులు ప్రస్తుతం పచ్చి మిర్చి, బెండ, కాకర, వంగ వంటి కూరగాయలు సాగు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి నడుచుకుంటూ గ్రామానికి చేరి ఏ ఇంటి గడపలో అడుగుపెట్టినా చిక్కటి మజ్జిగ ఇచ్చి ఆప్యాయంగా పలకరించే అక్కడ ప్రజల అనుబంధాలను పరిసర ప్రాంతాల ప్రజలు గొప్పగా చెప్పుకుంటూ ఉంటారు. అలాంటి వ్యవసాయ పనులు చేసుకునే రైతులు, వ్యసాయ కూలీలతో నిండిన గ్రామ ప్రజల బతుకుల్లో ‘అక్షరం’ అంకురించింది. ప్రతి ఇంటా విద్యా కుసుమాలు తారాజువ్వల్లా వెలుగొందుతున్నాయి.

ఒకే కుటుంబంలో నలుగురు డాక్టర్లు



డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు

సేద్యమే ఊపిరిగా జీవించే జీలపాటూరు గ్రామంలో గత కొంత కాలంగా ప్రతి కుటుంబంలోని పిల్లలందరూ క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదువుకోవడం వల్ల 30 మంది డాక్టర్లు, 28 మంది ఇంజినీర్లు, ఇద్దరు లాయర్లు ఉన్నారు. వైద్య వృత్తిలో కొనసాగుతున్న కొందరు వేర్వేరు దేశాల్లో స్థిరపడడం విశేషం. గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి, శ్రావణ్, శివప్రసాద్, ప్రవీణ్ తమిళనాడులోని పలు ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్నారు. అదేవిధంగా మహేంద్రరెడ్డి, మునిమోహన్, తనూజ, ఉషా, రేవంత్, సుజిత, అనీల్, సుజిత, రూప, అన్వేష్, నిఖిల, దినేష్, సమ్మన విజయ తదితరులు వివిధ ప్రాంతాల్లో వైద్య వృత్తిలో సేవలు అందిస్తున్నారు. జశ్విత, చేతన, వంశీ, దీపక్‌నాథ్ మెడిసిన్ చదువులు పూర్తి చేశారు. ముఖ్యంగా గ్రామానికి చెందిన డాక్టర్ పాలూరు మహేంద్రరెడ్డి కుటుంబంలో భార్య తనూజ, కుమారుడు అన్వేష్‌రెడ్డి, కోడలు జశ్విత నలుగురు డాక్టర్లు కావడం విశేషం. గ్రామానికి చెందిన చిన్నంబేటి మునిరత్నమ్మ శారదమ్మ దంపతుల కుమారుడు మునిమోహన్, కోడలు రూహి, కుమార్తె ఉషారాణి, అల్లుడు భరత్‌రెడ్డి ఒకే కుటుంబంలో నలుగురు వైద్యులుగా సేవలు అందిస్తున్నారు. గ్రామంలో ఆరూరు సుధాకర్, కందమూడి దశయ్య లాయర్లుగా కొనసాగుతున్నారు. బట్టా మహేంద్ర, కేసు భాస్కర్, బట్టా అంకయ్య, కందమూడి శ్రావణ్, ఆరూరు వంశీ, ఇలుపూరు రామ్‌ప్రసాద్, ఆరూరు సునీల్, ఆరూరు అఖిల్, ఉల్లిపాయల గిరి, సింగమాల బాలగురవయ్య, తిరుపతి మాతయ్య తదితరులు ఇంజనీరింగ్ చదువులు పూర్తి చేసి పలు ప్రాంతాల్లో సేవలు అందిస్తున్నారు. మారుమూల గ్రామమైన జీలపాటూరులో ఒకప్పుడు చెమటోడ్చి సేద్యం పనులు చేసుకుంటూ జీవనం సాగించే రైతు కుటుంబాల నుంచి వచ్చిన వీరు ఉన్నత విద్యనభ్యసించి డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులుగా పలు ప్రాంతాల్లో సేవలందించడం విశేషం.

వ్యవసాయమే జీవనాధారం



మా పూర్వీకులంతా చాలా కాలంగా వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతూ పది మందికి అన్నం పెట్టి ఆకలి తీర్చేవాళ్లు. వ్యవసాయ ఆధారిత కుటుంబాల నుంచి వచ్చిన నాతోపాటు చాలా మంది బాగా చదువుకున్నాం. ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో ఎక్కువ మంది డాక్టర్లుగా ఎదిగి దేశ విదేశాల్లో ఉన్నతమైన సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ పాలూరు మహేంద్రరెడ్డి, జీలపాటూరు

తల్లిదండ్రుల కష్టాలను బిడ్డలు గ్రహించారు



తరతరాలుగా తల్లిదండ్రులు సేద్యం పనుల్లో ఎదుర్కొంటున్న సమస్యలు, చెమటోడ్చే కష్టాలను ప్రతి కుటుంబంలో బిడ్డలు గ్రహించారు. చిన్నతనం నుండి కష్టపడి క్రమశిక్షణతో చదువుకోవడం వల్లే ఎక్కువ మంది మంచి భవిష్యత్తుకు బంగారు బాట వేసుకున్నారు. దేశవిదేశాల్లో స్థిరపడి వివిధ వృత్తుల్లో సేవలందిస్తున్నారు.

– సుబ్బరాఘవయ్య, జీలపాటూరు

నాకష్టం వృథా కాలేదు



ఎంతో కాలంగా వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించాను. నా కుమారుడిని ఇంజినీరింగ్ చదివించడం వల్ల మంచి ఉద్యోగం చేస్తూ విదేశాల్లో ఉన్నాడు. నేను చేసిన కష్టం వృథా కాలేదు. నాతోపాటు మా ఊరికి మంచి పేరు తీసుకొచ్చాడు.

– పాండురంగయ్య, జీలపాటూరు

కనుల పండువగా శ్రీవారి కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణం చేస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం శ్రీపెనుశిల లక్ష్మీ నరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి కల్యాణం నిత్యకల్యాణ మండపంలో ఆగమోక్తంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వివిధరకాల పుష్పాలు ఆభరణాలు అలంకరించి వేదపండితులు మంత్రోచ్ఛరణ మధ్య కల్యాణం నిర్వహించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించి పునీతులయ్యారు.

నిత్యాన్న పథకానికి రూ.లక్ష విరాళం

మండలంలోని పెంచలకోనలో వెలసిన శ్రీపెనుశిల లక్ష్మీ నరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం చాటగొట్ల గ్రామానికి చెందిన నలగర్ల గోపాలయ్య ధర్మపత్ని లక్ష్మీదేవి, కుమారుడు పవన్‌కుమార్ శనివారం ఆలయ సిబ్బంది నరసింహకు రూ 1,00,116 విరాళంగా అందించినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

లక్కీ డ్రా విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సుచిత్రాదేవి

గూడూరురూరల్ : పట్టణంలోని వివేకానంద రోడ్డులో ఉన్న ఓం శ్రీసాయి సత్యం ఓబులేష్ భారత్ గ్యాస్ కార్యాలయంలో శనివారం సాయంత్రం లక్కీ డ్రా నిర్వహించారు. విజేతలకు గ్యాస్ ఏజెన్సీ డీలర్ సుచిత్రాదేవి బహుమతులను అందజేశారు. ఆమె మాట్లాడుతూ వినాయక చవితి నుంచి సంక్రాంతి వరకు ప్రతినెలా చివరి వారంలో లక్కీ డ్రా తీసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు రెండవ కనెక్షన్ తీసుకున్న వారికి కన్సొలేషన్ బహుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. గ్యాస్ సిలిండర్ వినియోగం, సేఫ్టీ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలకు అవగాహన కల్పించారు. మండలంలోని విందూరు, వెందోడు, కొమ్మనేటూరు, తదితర ప్రాంతాల నుంచి కొత్త కనెక్షన్లు తీసుకున్నవారు వచ్చి ఈ లక్కీ డ్రాలో పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ మెహబూబి

గూడూరురూరల్ : పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం వస్తుందని గూడూరు సీడీపీఓ మెహబూబి తెలిపారు. రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని విందూరు సెక్టార్ పరిధిలో ఉన్న నెల్లటూరు-1, 2, గోగినేనిపురం అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారన్నారు. పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.హైమావతి, హెల్త్ సూపర్‌వైజర్ ఉమ, ఏఎన్‌ఎం శశి, అంగన్‌వాడీ కార్యకర్తలు శోభారాణి, ఉమాదేవి, రమణకుమారి, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణ వ్యాఖ్యలు సిగ్గుచేటు



మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం రెడ్డి

నాయుడుపేటటౌన్: గౌరవ శాసన సభలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సంస్కారహీనుడిలా మాట్లాడడం సిగ్గుచేటు విషయమని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి తీవ్రంగా విమర్శించారు. పట్టణంలోని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు సంబంధించిన పార్టీ క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం తంబిరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మెగాస్టార్ చిరంజీవిని తూలనాడినా పవన్ కల్యాణ్ స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌పై అసెంబ్లీలో అనుచితంగా మాట్లాడిన బాలకృష్ణ ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు.

రైతులకు జిప్సం పంపిణీ

కలువాయి(సైదాపురం): వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) నెల్లూరు, వారిచే ఆత్మ ప్రదర్శన క్షేత్రం కింద శనివారం వ్యవసాయశాఖ అధికారి కళారాణి వేరుశనగ, మరియు సజ్జ సస్యరక్షణ మరియు భూ యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వేరుశనగ, జిప్సం, మొక్కజొన్న విత్తనాలు రైతులకు పంపిణీ చేశారు.

మహిళలకు ప్రత్యేక చట్టాలు

వెంకటగిరి రూరల్: మహిళలకు రక్షణగా ప్రత్యేక చట్టాలు అమలులో ఉన్నాయని బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు అద్దంకి గాంధీ పేర్కొన్నారు. పట్టణంలోని మనులాలాపేటలో శనివారం న్యాయ విజ్ఞాన చైతన్యసదస్సు నిర్వహించారు.

రక్తదానం ప్రాణదానమే

కలువాయి(సైదాపురం): రక్తదానం ప్రాణదానంతో సమానమని రెడ్‌క్రాస్ వలంటీర్ అరిగేలా సాయిరాం అన్నారు. నెల్లూరు రెడ్‌క్రాస్‌కి సంబంధించిన వలంటీర్ అరిగేలా సాయిరాం రక్తదానంపై వినూత్న రీతిలో మోటార్ సైకిల్‌పై తిరుగుతూ మండలంలోని ప్రజలందరికీ అవగాహన కల్పిస్తున్నారు.

కన్యకాపరమేశ్వరి నగరోత్సవం



చిల్లకూరు: గూడూరు పట్టణంలోని గాంధీ బొమ్మ ప్రాంతంలో వెలిసిన కన్యకా పరమేశ్వరి అమ్మవారికి శనివారం నగరోత్సవం నిర్వహించారు. దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలను పంచి పెట్టారు. సాయంత్రం అమ్మవారికి నగరోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులకు పాల్గొనగా ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, ఆర్యవైశ్య మహిళా సమాజ సభ్యులు, కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దళితులపై దాడులను అడ్డుకోవాలి



అబ్రహంను పరామర్శిస్తున్న బీఎస్పీ నాయకులు

చిల్లకూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై జరుగుతున్న దాడులను అడ్డుకోవాలని బహుజన సమాజ్ పార్టీ, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గూడూరు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాపూరు అబ్రహంను శనివారం నాయకులు పరామర్శించారు.

దళితులపై దాడి సమంజసం కాదు

బాలాయపల్లి(సైదాపురం): పొలం విషయంలో దళితులపై కూటమి నేతలు దాడి చేయడం సమంజసం కాదని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాశిన భాస్కర్ గౌడ్ పేర్కొన్నారు. దాడికి గురై వైద్యశాలలో చికిత్స పొందుతున్న అబ్రహంను వైద్యశాలలో పరామర్శించారు.

గళం విప్పిన జెడ్పీటీసీ



మాట్లాడుతున్న జెడ్పీటీసీ అనిల్‌కుమార్ రెడ్డి

కలువాయి(సైదాపురం): నెల్లూరు జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో శనివారం జెడ్పీటీసీ అనిల్ కుమార్‌రెడ్డి పాల్గొని కలువాయి మండల సమస్యలపై తాగునీరు, పెండింగ్ బిల్లులు, రెవెన్యూ అధికారులు తీరు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ వెంటనే ఆ సమస్యలను పరిష్కరించాలంటూ అధికారులను ఆదేశించారు.

జీఎస్టీ తగ్గింపుతో ఊరట

చిట్టమూరు : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపు నిర్ణయంతో వినియోగదారులకు ఎంతగానో ఉరటనిస్తుందని తహసీల్దార్ నరేష్ తెలిపారు. మండల స్థాయిలో జీఎస్టీ అధికారులతో కలసి ఆయన సమావేశాన్ని రెవెన్యూ కార్యాలయంలో శనివారం నిర్వహించారు.

రైతులకు సబ్సిడీపై డ్రోన్ పంపిణీ



సబ్సిడీపై డ్రోన్ అందిస్తున్న అధికారులు

రాపూరు: వ్యవసాయానికి సంబంధించిన యంత్ర పరికరాలను సబ్సిడీపై రైతు బృందాలకు అందిస్తున్నట్లు పొదలకూరు వ్యవసాయ సంచాలకులు శివనాయక్ తెలిపారు. రాపూరులో శనివారం సబ్సిడీపై డ్రోన్ అందించారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సౌజన్యంతో రైతులకు ఈ డ్రోన్‌ను సబ్సిడీపై అందించినట్లు తెలిపారు. డ్రోన్ ద్వారా పంట పొలాల్లో క్రిమిసంహారక మందుల పిచికారీ, ఎరువులు, విత్తనాలు చల్లడం తదితర పనులకు వినియోగించుకోవచ్చన్నారు.

మేల్చూరు ‘పంచాయితీ’

బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని పెరిమిడి గ్రామ పంచాయతీ నుంచి మేల్చూరు గ్రామం, సీసీ కండ్రిగను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్తుల వినతి మేరకు ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం పెరిమిడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం బహిరంగ గ్రామ సభ నిర్వహించారు. పంచాయతీ ఏర్పాటుపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు. అయితే ఎలాంటి అభ్యంతరం లేదని గ్రామస్తులు తెలియజేసినట్లు తెలిపారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

దక్కిలి: మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 29వ తేదీ సోమవారం ఎంపీపీ గోను రాజశేఖర్ అధ్యక్షతన మండల నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రవీంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు, మండల శాఖ అధికారులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

పరిహారమిచ్చి ఆదుకోండి

చిల్లకూరు: సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న తమ భూములను క్రిస్ సిటీ పేరుతో 914 ఎకరాలు స్వాధీనం చేసుకుని ఆరు నెలలు పూర్తి కావస్తున్నా ఇప్పటివరకు పరిహారం అందించలేదని పల్లెవాని దిబ్బ గ్రామ చిన్న సన్నకారు రైతులు శనివారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘువేంద్రమీనకు విన్నవించారు. గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో వారు ఆయన్ను కలుసుకుని వినతి పత్రం అందించారు.

ఆక్రమణల తొలగింపు

కోట: మండల కేంద్రంలో ప్రభుత్వ మార్కెట్ స్థలాన్ని ఆక్రమించడంతో శనివారం అధికారులు పరిశీలించి అడ్డుకున్నారు. కోట బజారువీధి పంట కాలువ సమీపంలో విలువైన ప్రభుత్వ స్థలాన్ని గతంలో మార్కెట్ సముదాయానికి కేటాయించారు. ఈ స్థలాన్ని స్థానికులు కొందరు ఆక్రమించి పనులు చేపడుతుండగా తహసీల్దార్ జయజయరావు, ఇరిగేషన్ ఏఈ మునిరత్నం అక్కడకు చేరుకుని పనులను నిలుపుదల చేయించారు. చేపట్టిన నిర్మాణాలను తొలగించారు.

తప్పిదాలతో పోలేరమ్మతల్లి జాతర



మీడియాతో మాట్లాడుతున్న నేదురుమల్లి

వెంకటగిరి రూరల్: వెంకటగిరిలో ఈ నెల 10, 11వ తేదీల్లో నిర్వహించిన పోలేరమ్మతల్లి జాతర తప్పిదాలతోనే జరిపించారని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఘాటు విమర్శలు చేశారు. 2023లో నేతన్న నేస్తం నిధులు విడుదల సందర్భంగా వెంకటగిరికి విచ్చేసి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించారని గుర్తుచేశారు. ఆ ఏడాది అమ్మవారి జాతరను ప్రజల పండుగగా అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు గుర్తుచేశారు. ఈ ఏడాది జరిగిన జాతరలో రాష్ట్ర పండుగను తాము సాధించినట్లు కొందరు కరపత్రాల్లో ముద్రించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అమ్మవారి జాతరకు రూ.42 లక్షలు మున్సిపల్ నిధులు కేటాయించి ఇందుకు కౌన్సిలర్లు తీర్మానించగా కనీసం వారికి సైతం అమ్మవారి దర్శన భాగ్యం కల్పించడంలో ప్రధాన్యత కల్పించకపోవడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, బాలాయపల్లి, దక్కిలి మండల కన్వీనర్లు వెందోటి కార్తీక్‌రెడ్డి, చింతల శ్రీనివాసులరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సేతరాసి బాలయ్య, విప్ పూజారి లక్ష్మి, కౌన్సిలర్లు కందాటి కళ్యాణి, ఆరి శంకరయ్య, నాయకులు ఎం వెంకటేశ్వర్లు, వెంకటరత్నంరాజు, సిహెచ్ మురళీ పాల్గొన్నారు.

పోలేరమ్మతల్లికి నేదురుమల్లి ప్రత్యేక పూజలు



పోలేరమ్మతల్లికి పూజలు చేస్తున్న నేదురుమల్లి

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి శక్తిస్వరూపిణి శ్రీ పోలేరమ్మతల్లిని అమ్మవారిని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శనివారం దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పండితులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని ఆశీర్వదించారు.

కౌన్సిలర్‌కు పరామర్శ

పట్టణంలోని 23వ వార్డు కౌన్సిలర్ ఆటంబాకం శ్రీనివాసులు అనారోగ్యానికి గురికావడంతో వారి నివాసం వద్దకు చేరుకుని ఆటంబాకం శ్రీనివాసులు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, బాలాయపల్లి, దక్కిలి మండల కన్వీనర్లు వెందోటి కార్తీక్‌రెడ్డి, చింతల శ్రీనివాసులరెడ్డి, మున్సిపల్ విప్ పూజారి లక్ష్మి, కౌన్సిలర్లు కందాటి కల్యాణి, ఆరి శంకరయ్య, వైఎస్సార్‌సీపీ నేతలు కొండురూ వెంకటరత్నంరాజు, సిహెచ్ మురళి, కందాటి రాజారెడ్డి, పూజారి శ్రీనివాసులు, మల్లిరెడ్డి, ములవాయిల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నవరాత్రి అలంకరణల్లో అమ్మవారు



చిట్టమూరు: మహాలక్ష్మీగా దర్శనమిస్తున్న కామాక్షిదేవి



చిల్లకూరు: సంతానలక్ష్మీగా దర్శనమిస్తున్న ఆదిలక్ష్మి



సూళ్లూరుపేట: బాలాత్రిపురసుందరిగా శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి



రాపూరు : పెంచలకోనలో సంతాన లక్ష్మీ అలంకరణలో ఆదిలక్ష్మీదేవి



వెంకటగిరి : మీనాక్షిదేవిగా కాత్యాయిని అమ్మవారు



నాయుడుపేట: లలితా త్రిపుర సుందరిగా దుర్గామల్లేశ్వరి దేవి